**G. JAGADISH REDDY**
**M.L.A.**
**91- SURYAPET CONSTITUENCY**

H.No. 1-2-93/1,
MLA CAMP OFFICE,
Old Market Road,
SURYAPET -508213.
PHONE : 08684-253444

హైదరాబాద్,
29 జూన్ 2024.

**గౌరవనీయులైన జస్టిస్ నర్సింహారెడ్డి గారికి,**
**ది కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ,**
**సెవెంత్ ఫ్లోర్, బీఆర్‌కే భవన్, ఆదర్శ్‌నగర్,**
**హైదరాబాద్-500063.**

**సబ్జెక్టు**:- ది కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ కాన్స్టిట్యూటెడ్ అండర్ కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్-1952 వైడ్ జీఓఎంస్ నంబర్ 9 ఎనర్జీ(పవర్-II) డిపార్టుమెంట్, డేటెడ్ 14-3-2024.

******

ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వివిధ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, చత్తీస్‌గఢ్‌తో జరిగిన విద్యుత్ కొనుగోలు, పీజీసీఐఎల్ లైన్లో వాటా కొనుగోలు ఒప్పందాలు, నిబంధనల ప్రకారం జరిగాయా లేదా ప్రభుత్వ ఖజానాకు ఏమైనా నష్టం జరిగిందా అనే విషయాలపైన విచారణ చేస్తున్న మీరు మీకందిన సమాచారాన్ని నాకు అందజేసి, నాకు తెలిసిన విషయాలను, నా అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేసే అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు.

నవీన యుగంలో విద్యుత్ యొక్క ప్రాధాన్యత మీకు తెలియనిది కాదు. ఇవ్వాల అభివృద్ధి సూచికలలో విద్యుత్తే ప్రధానమైనదన్న విషయం మన అందరికీ తెలుసు. పారిశ్రామిక రంగమే కాదు సాగునీరు తాగునీరు రవాణా కమ్యూనికేషన్ వంటి సమస్త రంగాలు విద్యుత్తుపైననే ఆధారపడి ఉంటాయన్న విషయం సత్యం. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి జీవితంలో విద్యుత్ ఒక విడదీయలేని భాగమయింది అంటే అతిశయోక్తి కాదేమో.

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుగారి నాయకత్వంలో టీఆరెస్ ప్రభుత్వం ఏర్పడిన విషయం మీకు తెలిసిందే. ఆరోజు నాటికి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విద్యుత్ పరిస్థితి ఏవిధంగా ఉండెనో తెలంగాణ బిడ్డగా మీకు తెలుసు. తెలంగాణలో ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఆనాటికి అందుబాటులో ఉన్న విద్యుత్తులో 53.89 శాతం తెలంగాణకు, 46.11 శాతం ఆంధ్రప్రదేశ్‌కు



Scanned with OKEN Scanner

కేటాయించి, ఆ విధంగా పది సంవత్సరాలపాటు విద్యుత్తును వినియోగించుకోవాలని నిర్దేశించింది. ఆనాటికే తెలంగాణ రాష్ట్రానికి 2700 మెగావాట్ల విద్యుత్తు కొరత ఉంది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన 400 మెగావాట్ల సీలేరు జలవిద్యుత్తు కేంద్రాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంలో లాబీయింగ్ చేసి బలవంతంగా గుంజుకుంది. దీంతో తెలంగాణ విద్యుత్ పరిస్థితి మరింత దిగజారింది. ఆపైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునర్విభజన చట్టప్రకారం మనకు రావలసిన విద్యుత్‌ను ఇవ్వకుండా తెలంగాణను మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేసింది.

రాష్ట్రంలో విద్యుత్ అందుబాటులో లేక, ఉత్తరాది నుంచి కొందామనుకున్నా లైన్లు లేక తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. పరిశ్రమలకు మూడు రోజుల పవర్ హాలిడేస్, పట్టణాలు నగరాలు గ్రామాలు తేడా లేకుండా రోజు అనేక గంటల పాటు విద్యుత్ కోతలు, వ్యవసాయానికి కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియని పరిస్థితి. వ్యవసాయం తీవ్ర నిరాదరణకు గురై వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి. మరోక వైపు వాణిజ్యం జరగకపోవడం పరిశ్రమలు మూతపడడం తీవ్రమైన నిరుద్యోగానికి దారితీశాయి.

ఇటువంటి పరిస్థితుల్లో బాధ్యతలు తీసుకున్న మొదటి తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా విద్యుత్ రంగంపైననే దృష్టిపెట్టి వ్యవసాయంతో సహా అన్ని రంగాల వినియోగదారులకు ఇరవైనాలుగు గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగానే కొత్త విద్యుత్ ప్రాజెక్టులను వేగంగా నిర్మించాలని, తక్షణమే సంక్షోభం నుంచి బయటపడడంకొరకు తాత్కాలిక పరిష్కారంగా దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్తును త్వరితగతిన కొనుగోలు చేయాలని విద్యుత్ సంస్థలను ఆదేశించింది. దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కడా విద్యుత్ అందుబాటులో లేదని, మన పొరుగునే ఉన్న చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అదనపు విద్యుత్తు అందుబాటులో ఉన్నట్టు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ తీసుకురావడానికి ఉన్న అవకాశాలపై ఆ రాష్ట్రంతో తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థల అధికారులు చర్చలు చేయడం జరిగింది. అక్కడి నుంచి విద్యుత్తును తీసుకురావడానికి ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ పీజీసీఐఎల్ మహారాష్ట్రలోని వార్ధా నుంచి డిచ్‌పల్లి వరకు ట్రాన్స్‌మిషన్‌లైను నిర్మాణం ప్రారంభించింది.

దీని ద్వారా చత్తీస్‌గఢ్ విద్యుత్తును తెలంగాణకు తీసుకురావడానికి అవకాశం ఉందని తెలుసుకుని వెంటనే పీజీసీఐఎల్‌తో మన విద్యుత్ సంస్థల అధికారులు సంప్రదింపులు జరిపారు. ఆ సమయంలో ఉత్తరాది గ్రిడ్‌ను



Scanned with OKEN Scanner

అనుసంధానం చేసుకోవడానికి దక్షిణాది రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొని ఉంది. పీజీసీఐఎల్ నిబంధనలలో మొదట వచ్చినవారికే మొదటి అవకాశం ఇచ్చే వీలుంది. అదేవిధంగా ఏదో ఒక ప్రాజెక్టు నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఉండి తీరాలన్న నిబంధన కూడా ఉంది.

ఆనాడు రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాలు, దక్షిణాది రాష్ట్రాల మధ్య నెలకొని ఉన్న పోటీవాతావరణం అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని 2003 కేంద్ర ప్రభుత్వ విద్యుత్తు చట్టం ప్రకారం పీజీసీఐఎల్ నిబంధనలకు లోబడి చత్తీస్ గడ్ రాష్ట్రంతో ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకోవడం జరిగింది. ఆ తర్వాత ఇరురాష్ట్రాల విద్యుత్ సంస్థల అధికారులు నిబంధనల ప్రకారం విద్యుత్ ఒప్పందం చేసుకోవడం జరిగింది. విద్యుత్తు ధర కూడా కేంద్ర ప్రభుత్వ చట్టాల పరిధిలో ఈఆర్సీలే నిర్ణయించడం జరిగింది. తెలంగాణ ఈఆర్సీ చత్తీస్గడ్ నుంచి కొనుగోలు చేసే విద్యుత్తు ధర 3.90 రూపాయలుగా నిర్ణయించడం జరిగింది. ఆ సమయానికి మన రాష్ట్రం ఎన్ టీపీసీ లేక ఇతర సంస్థల నుంచి తీసుకుంటున్న విద్యుత్తుకు యూనిట్కు 5 రూపాయల నుంచి 17 రూపాయల వరకు చెల్లిస్తున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. అదే సందర్భంలో తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలు టెండరు పద్ధతిలో యూనిట్ 4.94 రూపాయల చొప్పున కొనుగోలు చేయడానికి పీపీఏ(ఐపీపీ)లు చేసుకోవడం జరిగింది. రామగుండం ఎన్టీపీసీ ద్వారా జనవరి 2024 నుంచి మన రాష్ట్రానికి ఇస్తున్న 1600 మెగావాట్ల విద్యుత్తుకు యూనిట్కు 5.60 రూపాయలకుపైగా చెల్లిస్తున్నామన్న విషయాన్ని కూడా మీ దృష్టికి తెస్తున్నాను. ఇదే సమయంలో తెలంగాణ విద్యుత్ సంస్థలు విద్యుత్ కొనుగోలు కొరకు ఓపెన్ టెండర్లు ఆహ్వానిస్తే, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు చట్టప్రకారం తెలంగాణకు ఇవ్వాల్సిన విద్యుత్తును ఇవ్వకపోవడమే కాకుండా, ఆ టెండర్ లో పాల్గొని యూనిట్ ధర 5.35 రూపాయలకు కోట్ చేయడం జరిగింది. ఈ విషయాలన్నీ పరిశీలించినప్పుడు పీజీసీఐఎల్ లైన్లో వాటా కొనుగోలు వల్ల గానీ, చత్తీస్గడ్ రాష్ట్రం నుంచి విద్యుత్ కొనుగోలు వలన కానీ మనకే మేలు జరిగింది, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడింది తప్ప ఎటువంటి నష్టం జరుగలేదని విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఇక భద్రాద్రి విద్యుత్ కేంద్రం సబ్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా నిర్మాణం చేసిన విషయానికి వస్తే, ఆనాడు ఉన్న చట్టాలకు, నిబంధనలకు లోబడే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ విషయంలో ఆనాడున్న సంక్షోభ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మన జెన్కో ఆధ్వర్యంలోనే విద్యుత్ ప్రాజెక్టులను త్వరితగతిన నిర్మించాలని



Scanned with OKEN Scanner

నిర్ణయించుకుని చర్చిస్తున్న సందర్భంలో నవరత్నాలలో ఒకటైన భారత ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ ముందుకువచ్చి అతితక్కువ కాలంలో మేము నిర్మాణం చేస్తామని చెప్పడం జరిగింది. సంప్రదింపులలో భాగంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా 800 మెగావాట్ల ప్లాంటు నిర్మాణానికి తక్కువలో తక్కువ నాలుగు సంవత్సరాలు పడుతుందని, కానీ ఇదే సందర్భంలో మా వద్ద 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగల నాలుగు యూనిట్లు రెడీగా అందుబాటులో ఉన్నాయని, వాటితో రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టు పూర్తి చేసి 1080 మెగావాట్ల విద్యుత్తును అందిస్తామని, కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం 2017 మార్చిలోపే నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆరోజు నాటికి ఎన్టీపీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు దేశంలో తయారయ్యే విద్యుత్తు 90 శాతంపైగా సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మితమైనవి అన్న విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. అదే విధంగా దేశంలో ఇంకా 17 విద్యుత్ ప్రాజెక్టులు సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మాణంలో ఉన్నాయని, వాటి కంటే ముందే మణుగూరు ప్రాజెక్టు పూర్తి చేస్తామని బీహెచ్ఈఎల్ చెప్పడంతో నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్‌పైన పనులు అప్పగించే అవకాశం ఉంది కాబట్టి ఆలస్యం చేయకుండా వెంటనే కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణానికి, అదే విధంగా మణుగూరులో నాలుగు 270 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణానికి బీహెచ్ఈఎల్, జెన్‌కోలు ఒప్పందం చేసుకోడం జరిగింది. అనుకున్న మాట ప్రకారం కొత్తగూడెం 800 మెగావాట్ల ప్రాజెక్టు 48 నెలల్లోనే పూర్తి చేసి, జెన్‌కోకు అప్పగించడం జరిగింది. ఇది ఇప్పటివరకు భారత దేశ చరిత్రలోనే అతితక్కువ సమయంలో నిర్మాణమైన ప్రాజెక్టుగా రికార్డు సృష్టించింది. కానీ మణుగూరు ప్రాజెక్టు దురదృష్టవశాత్తు ఎన్‌జీటీ స్టే, ఆ తర్వాత కోవిడ్ రావడం కొంత ఆలస్యమైంది. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ప్లాంట్లు కూడా 50 శాతం పీఎల్ఎఫ్‌తో నడుపాలని ఇచ్చిన మెమోతో సూపర్ క్రిటికల్, సబ్ క్రిటికల్ టెక్నాలజీల వాదానికి అర్థమే లేకుండా పోయింది. పైగా హైదరాబాద్‌తోపాటు నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడాలేకుండా లక్షలాది పెట్రోలు, డీజెల్ జనరేటర్లు సృష్టిస్తున్న వాయు, శబ్దకాలుష్యాల నుంచి ప్రజలకు విముక్తి లభించింది.

ఇంకొక విషయం, నల్లగొండ జిల్లా దామరచర్లలో 4000 మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంటు(యూఎంపీపీ) నిర్మాణం. రైతులకు కూడా 24 గంటల విద్యుత్తును అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో మరియు వేగంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మరొక భారీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టును నిర్మించాలని తలపెట్టింది. ఒక విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి భూమి, నీరు, రోడ్డు రవాణా, రైలు రవాణా సౌకర్యాలు



Scanned with OKEN Scanner

ముఖ్యమైనవి. బొగ్గు కేటాయింపు(కోల్ లింకేజి) అన్నది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అధికారం. ఇదే సందర్భంలో దేశంలో బొగ్గుతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్లు అన్ని కూడా తప్పకుండా పదిశాతం విదేశీ బొగ్గును వాడాలని నిబంధన కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. వీటితోపాటు ప్లాంటు నుంచి భారీగా వెలువడే ఫ్లైయాష్‌ను వెంటవెంటనే డిస్పోజ్ చేయాలన్న ఎన్‌జీటి నిబంధన కూడా ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న సిమెంటు కంపెనీలు ఫ్లైయాష్ ను వెంటవెంటనే తీసుకుపోవడానికి ముందుకు వచ్చి అంగీకారం తెలియజేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం బొగ్గు లింకేజి ఎక్కడి నుంచైనా ఇవ్వవచ్చు. విదేశీ బొగ్గు వాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనను కఠినంగా అమలు చేస్తే కూడా పోర్టులన్నిటికీ అతిచేరువలో ఉన్న ప్రాంతం దామరచర్లనే. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు దామరచర్లలో యూఎంపీపీ నిర్మాణం పూర్తిగా సహేతుకమైనది. దీంతోపాటు అభివృద్ధి ఒకే చోట కేంద్రీకరించడం వల్ల అనేక అనర్థాలకు దారితీస్తున్న సంగతి మీకు విదితమే. దేశాల్లో కావచ్చు రాష్ట్రాల్లో కావచ్చు అభివృద్ధి విషయంలో జరిగిన అసమానతల వల్లనే దేశాలు, రాష్ట్రాలు విడిపోయిన విషయం కూడా మనందరికీ తెలుసు. గత డెబ్బై సంవత్సరాలుగా వ్యవసాయాధారిత ప్రాంతమైన నల్లగొండ జిల్లా అభివృద్ధిలో పూర్తిగా వెనుకపడిపోయిందన్న భావన ప్రజల్లో ఉంది. గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం, జిల్లాకు న్యాయంగా రావలసిన నదీజలాలను కూడా అందించలేకపోవడం జిల్లా ఎడారిగా మారిపోయింది. ప్రపంచంలోనే అత్యధికంగా బోరుబావులున్న ప్రాంతంగా నల్లగొండ జిల్లా రికార్డులకెక్కింది. సాగునీరే కాదు తాగునీటికి కూడా దిక్కులేనిదయింది. మంచినీళ్లు లేక ఫ్లోరైడు సమస్యతో లక్షలాది మంది అంగవైకల్యానికి గురయిన జిల్లా కూడా నల్లగొండనే. జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారీ పరిశ్రమ లేదు. విద్యుత్ ప్రాజెక్టు జిల్లాకు రావాలన్న జిల్లా ప్రజల కోరికను నేను మంత్రిగా ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక దార్శనిక ప్రభుత్వం తీసుకున్న ఒక మంచి నిర్ణయంగా దీనిని భావించాలి. ఈ దేశంలో కొన్ని విద్యుత్ ప్లాంట్లు విదేశీ బొగ్గుతో నడుస్తున్నాయన్న విషయం వాస్తవం. విజయవాడ సమీపంలోని వీటీపీఎస్, కడపజిల్లా ముద్దనూరు ఆర్‌టీపీపీ, రాయచూరు పవర్ ప్లాంట్, ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న అనేక ప్రాజెక్టులు కూడా వేర్వేరు చోట్ల నుంచి బొగ్గు తెచ్చుకుంటున్నాయన్న విషయం కూడా మన అందరికీ తెలుసు. అందువల్ల బొగ్గున్న చోటే విద్యుత్ ప్లాంటు నిర్మించాలన్నది ఒక అర్థరహితమైన వాదన.



Scanned with OKEN Scanner

టీపీఎస్ స్టేజ్ VIII(1X800 MW) విద్యుత్ ప్రాజెక్టును 3810 కోట్ల రూపాయలకు బీహెచ్ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిలో ఇవ్వడం జరిగింది. ఇదే సమయంలో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ప్రాజెక్టు పనిని రెండు భాగాలుగా చేసి బీటీజీని బీహెచ్ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిపై, మరో భాగం బీఓపీని ప్రైవేటు కంపెనీలకు టెండరుపై ఇచ్చింది. తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్ V(1X800 MW) ప్రాజెక్టును బీటీజీ 2307 కోట్లకు నామినేషన్ పద్ధతుల్లో ఇస్తూ బీఓపీపీ కాంట్రాక్టును ఓపెన్ టెండరులో బీజీఆర్ఈఎస్ఎల్ కంపెనీకి 2299 కోట్ల రూపాయలకు అంటే మొత్తం కలిపి 4606 కోట్లకు ఇవ్వడం జరిగింది. అదే విధంగా దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్II(1X800 MW) బీటీజీని నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌కు 2307 కోట్ల రూపాయలకు మరియు బీఓపీ కాంట్రాక్టును టీపీఎల్ అనే సంస్థకు 2660 కోట్ల రూపాయలకు అంటే మొత్తం 4967 కోట్ల రూపాయలకు ఇవ్వడం జరిగింది. అంటే ఆనాడు ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే దాదాపు మన జెన్‌కో అతితక్కువ ధరకు బీహెచ్ఈఎల్‌కు నామినేషన్‌పై ఇచ్చిందన్న విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా బీటీజీని బీహెచ్ఈఎల్‌కు నామినేషన్‌పైనే ఇచ్చిన విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. అదేవిధంగా ఓపెన్ టెండర్ ద్వారా ఇచ్చిన బీఓపీకి అతి ఎక్కువ దాదాపు తెలంగాణ కంటే ఒక ప్లాంటులో 800 కోట్లు, మరొక ప్లాంటులో 1150 కోట్ల రూపాయలు ఎక్కువ ఇచ్చిందన్న విషయాన్ని కూడా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

మీ విచారణాంశాలైన పీజీసీఐఎల్ లైనులో వాటా కొనుగోలు, చెల్లింపుల గురించికానీ, చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, చెల్లింపుల గురించి కానీ, మణుగూరు, యాదాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలోని హేతుబద్ధత గురించి కానీ ఎక్కడా ఎటువంటి అనుమానాలకు తావులేదని, పూర్తిగా ప్రభుత్వానికి ప్రభుత్వానికి మధ్యన కానీ, ప్రభుత్వ రంగ సంస్థకు మరో ప్రభుత్వ రంగ సంస్థకు మధ్యకానీ జరిగే ఒప్పందాలలో ప్రజాధనం దుర్వినియోగానికి అవకాశమే లేదనే విషయం మీకు కూడా తెలుసు. ఈ విషయాలన్నింటిపైన గతంలో శాసనసభలో పూర్తిస్థాయిలో చర్చ జరిగిందనే విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను. ఆనాడవి శాసనసభలో ఉన్న ప్రతిపక్షాలు ప్రశ్నల రూపంలో ఇతర పద్ధతుల్లో చర్చకు తెచ్చినప్పుడు ఆధారాలతో సహా అన్ని విషయాలను బహిరంగపర్చడం జరిగింది. ఈఆర్‌సీ వద్ద కూడా ఇదే వ్యక్తులు వారి అనుమానాలను అభ్యంతరాలను వ్యక్తీకరించడం, వాటన్నింటినీ విచారించిన తర్వాతనే ఈఆర్‌సీ తన నిర్ణయాలను ప్రకటించడం జరిగింది.



Scanned with OKEN Scanner

కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో సాధించిన అసాధారణ విజయాలకు మసిబూసే ప్రయత్నమే ఈ నిరాధారమైన ఆరోపణలు. ఇరవై నాలుగు గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం ద్వారా వ్యవసాయ రంగంలో మునుపెన్నడూ లేని ఆహారధాన్యాల ఉత్పత్తిని దేశానికి అందించింది. రాష్ట్రం ఏర్పడేనాటికి ఆకలి చావులు, ఆత్మహత్యలతో కునారిల్లిన తెలంగాణ ఇవ్వాళ 3.5 కోట్ల టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశానికే అన్నపూర్ణగా మారింది. ఇవ్వాళ ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించిందంటే అదీ విద్యుత్ రంగ విజయమే. వేలాది పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి దాదాపు 20 లక్షలమంది యువతీయువకులకు ఉపాధి కల్పించి అనేక రంగాలలో భారత దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రం నుంచి 57 వేల కోట్ల రూపాయలుగా ఉన్న ఐటీ ఎగుమతులు 2.41, లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయంటే ఆలంబన విద్యుత్తే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాడు 1,12,120 రూపాయలుగా ఉన్న తలసరి ఆదాయం నేడు దాదాపు 3,20,000 రూపాయలకు పెరిగిందంటే విద్యుత్ విజయమే వీటన్నింటికీ కారణం. దేశాలు లేక రాష్ట్రాల అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం ఒక ప్రధాన ప్రాతిపదిక అన్నది అందరికీ తెలిసిన విషయమే. తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం నాడు 1196 కిలోవాట్ అవర్స్ ఉండగా నేడది 2349 కిలోవాట్ అవర్స్‌కు పెరిగిందీ అంటే అది కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధాన విజయమే.

వాస్తవాలు ఇలా ఉంటే, వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా మీరు ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా అభిప్రాయాలు ప్రకటించడం బాధాకరం. ఏదైనా ఒక విషయంపైన విచారణ చేసేటప్పుడు అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ విచారించాలన్న విషయం మీకు తెలియనిది కాదు. చత్తీస్‌గఢ్ ఒప్పందం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, విద్యుత్ సంస్థల అధికారులు, ఆనాటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ గారు, అక్కడి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, విద్యుత్ సంస్థల అధికారుల మధ్య జరిగిందన్న విషయం మీకు తెలుసు. అదేవిధంగా భద్రాద్రి ప్లాంటుకు సంబంధించి అనేక కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు రావడం జరిగింది. అందులో కేంద్ర మంత్రులు, అధికారులు భాగస్వాములనే విషయం కూడా మీకు తెలుసు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం కావడానికి ఎన్‌జీటీ స్టేతో పాటు వివిధ శాఖల నుంచి రావలసిన అనుమతులు ఆలస్యం అవడం కూడా కారణమే. మరి ఈ విచారణాంశాల్లో భాగస్వాములైన అందరినీ విచారిస్తేనే మీరు సరైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉండేదని నేను భావిస్తున్న. కానీ ఆ విధంగా కాకుండా కొద్దిమందితో మాత్రమే సమాచారం తీసుకుని పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించి ఒకపక్షం వాదనలతో మీరు ఏకీభవిస్తున్నట్టుగా మీరు మాట్లాడడం బాధాకరం.



Scanned with OKEN Scanner

ఇది మా రాజకీయ ప్రత్యర్థులు కళ్ళపూరితంగా చేసిన నిరాధార, అర్ధరహిత ఆరోపణలకు ఊతమిచ్చి-నట్టయింది. పద్నాలుగు సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర సాధనకొరకు ఉద్యమించి, చివరికి తన ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించి, తెచ్చిన రాష్ట్రాన్ని ఈ పది సంవత్సరాల కాలంలో అనేక రంగాలలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపి రానేరాదన్న కరెంటును నిమిషం కూడా పోనేపోదన్న స్థితికి తీసుకు వచ్చిన దార్శనికుడు కేసీఆర్ గారి పేరును మీరు అక్కడ ప్రస్తావించడం, ఏదో నష్టం జరిగిపోయింది ఇక లెక్కగట్టడమే తరువాయి అన్న మీ వ్యాఖ్యలకు అనుకూలంగా తెల్లవారి మరునాడే ప్రధాన పత్రికల్లో ప్రధాన శీర్షికగా ఆరు వేల కోట్ల నష్టం అని వార్తలు రావడం దురదృష్టకరం. మీ విచారణ జరుగుతున్న సమయంలోనే ఈ వార్తలు వచ్చినందున వారికి ఆ సమాచారం ఎవరి ద్వారా వచ్చింది, ఏ ఆధారాలతో వారు ఆ వార్తను ప్రచురించారు వంటి అంశాలన్నీ కూడా విచారణలో భాగం కావాల్సిన అవసరం ఉంది. లేనట్టయితే అరకొర సమాచారంతో కేవలం గత ప్రభుత్వాన్ని, కేసీఆర్ గారిని బద్నాం చేయడంకోసమే ఈ విచారణ జరుపుతున్నట్టుగా మేము భావించవలసి వస్తుంది. విచారణ పూర్తికాకముందే విలేఖరుల సమావేశం నిర్వహించడం ఎంక్వయిరీ కమిషన్ సంప్రదాయాలకు విరుద్ధం. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా, తెలంగాణ బిడ్డగా మీపైన మాకు గౌరవం ఉంది. మీ విచారణ ద్వారా వాస్తవాలు బయటికి వస్తాయని ప్రజలకు నిజం తెలుస్తదని మేము సంతోషించాము. కానీ గత ప్రభుత్వంపైన, కేసీఆర్ గారిపైన మీరు వ్యతిరేక భావనతో ఉన్నట్టుగా, మా రాజకీయ ప్రత్యర్థులు చేసిన వాదనలతో మీరు ఏకీభవిస్తున్నట్టుగా మీ మాటల్లో స్పష్టమైంది. ఇది సహజన్యాయ సూత్రాలకు విరుద్ధం. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించడం లేదని భావిస్తూ...

ధన్యవాదాలతో

**(గుంటకండ్ల జగదీశ్ రెడ్డి)**

**మాజీ విద్యుత్‌శాఖ మంత్రి**



Scanned with OKEN Scanner